


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
13-03-2026
పేజీలు: 02

# పెళ్లి రద్దయిందని.. అమ్మాయికి ఎయిడ్స్ ఇంజెక్షన్ ఎక్కించాడు!

‘రాజు వెడ్స్ రాంబాయి’ ఘటన రిపీట్ హైదరాబాద్‌లోని పోచారంలో ‘రాంబాయి’ సినిమా తరహాలో ఒక దారుణమైన ఘటన జరిగింది. ఎయిడ్స్ బాధితుడైన మనోహర్ అనే యువకుడు, తనకు నిశ్చయమైన పెళ్లి రద్దవడంతో కక్ష పెంచుకున్నాడు. ఈనెల 11న సదరు యువతి ఇంటికి వెళ్లి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో తన రక్తంతో కూడిన ఇంజెక్షన్‌ను ఆమెకు బలవంతంగా ఎక్కించాడు. యువతి ఫిర్యాదుతో పోలీసులు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు మనోహర్, బాధితురాలిని కొంతకాలంగా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. మనోహర్‌కు HIV(ఎయిడ్స్) పాజిటివ్ ఉందని తెలియడంతో ఆ యువతి అతడితో పెళ్లికి నిరాకరించింది. తన ప్రాణాలను పణంగాపెట్టి పెళ్లి చేసుకోలేనని స్పష్టం చేసింది. తన వ్యాధి గురించి తెలిసి పెళ్లికి నో చెప్పిందనే కోపంతో మనోహర్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. ‘నేను ఎలాగూ చనిపోతాను.. నువ్వు కూడా నాతోనే రావాలి’ అనే వికృత ఆలోచనతో, తనకు సోకిన రక్తాన్ని లేదా ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఆ యువతి శరీరంలోకి ఎక్కించాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఘట్‌కేసర్ పోలీసులు వెంటనే స్పందించారు. మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ రక్తాన్ని అతను ఎక్కడి నుంచి సేకరించాడు? దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో




పోలీసులు విచారిస్తున్నారు. బాధితురాలిని వెంటనే ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రేమ పేరుతో ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు ప్రయోగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని స్థానికులు ఆకాంక్షించారు.



## పుతిన్‌పై సంచలన వ్యాఖ్యలు చేసిన ట్రంప్

ఇరాన్ తో అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇరాన్‌కు సహకరిస్తూ ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు ఫాక్స్ న్యూస్ రేడియో ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. రష్యా నుంచి ఇరాన్‌కు కొంతమేర మద్దతు అందుతోందని అనుమానం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా మారుతున్న సమీకరణాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ‘‘రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్‌కు మేము సాయం చేస్తున్నామని పుతిన్ భావిస్తున్నారు. దానికి ప్రతిగా ఆయన ఇరాన్‌కు సాయం చేస్తూ ఉండవచ్చు’’ అని అన్నారు. ప్రపంచ శక్తుల మధ్య ఇదొక సాధారణ ధోరణిగా మారిందని, తాము ఒక పక్షానికి సాయం చేస్తే చైనా లేదా రష్యా మరో పక్షానికి మద్దతు ఇస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.



## సోనమ్ వాంగ్‌చుక్ రిలీజ్‌కు ప్రభుత్వం ఆదేశాలు


సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను రిలీజ్ చేయనున్నారు. ఆర్నెళ్ల క్రితం అతన్ని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. జాతీయ భద్రతా చట్టం కింద అతన్ని అరెస్టు చేశారు. లేహ్‌లో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో సోనమ్ వాంగ్‌చుక్‌ను ప్రభుత్వం అదుపులోకి తీసుకున్నది. అయితే లడాఖ్‌లో శాంతి, స్థిరత్వం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని వర్గాలతో నిర్మాణాత్మక చర్చలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్నట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఈ నేపథ్యంలో సోనమ్‌పై ఉన్న నిర్బంధాన్ని తక్షణమే ఎత్తివేయాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 2025, సెప్టెంబర్ 24వ తేదీన లేహ్‌లో అల్లర్లు చోటుచేసుకున్నాయి. శాంతి, భద్రతలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో ఎన్‌ఎస్‌ఏ చట్టం కింద 2025, సెప్టెంబర్ 26వ తేదీన సోనమ్‌ను అరెస్టు చేశారు.లేహ్ జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల ప్రకారం అతన్ని అదుపులోకి తీసుకున్నారు. లడాఖ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలు ప్రయత్నం చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. బంద్‌లు, నిరసనలో ప్రాంతం నిర్వీర్యం అవుతున్న నేపథ్యంలో హైపవర్ కమిటీ ద్వారా సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పింది.

## వృద్ధురాలిని పీక్కుతిన్న పెంపుడు పిల్లులు



మంచిర్యాల జిల్లాలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. పెంచుకున్న పెంపుడు పిల్లులే ఓ వృద్ధురాలిని దారుణంగా పీక్కుతిన్నాయి. వివరాల్లోకి వెళితే మంచిర్యాల జిల్లా మందమర్రిలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన జక్కనబోయిన లక్ష్మి (80) తన భర్త రాజీరు చనిపోవడంతో 16 ఏళ్లుగా ఒంటరిగా జీవిస్తోంది. లక్ష్మికి ముగ్గురు కొడుకులు ఒక కూతురు.. నలుగురు సంతానం కాగా వారందరికి పెళ్లిలు అయి ఎవరికి వారే వేరు వేరుగా జీవిస్తున్నారు. లక్ష్మి మాత్రం తన సొంత ఇంటిలో ఒంటరిగా జీవిస్తోంది. లక్ష్మి రెండో కుమారుడు సముందర్ గత కొన్నేళ్లుగా తల్లి లక్ష్మి బాగోగులు చూసుకుంటున్నాడు. వారానికి రెండు సార్లు వచ్చి తల్లి యోగక్షేమాలు అడిగి వెళుతుంటాడు. అయితే గత నాలుగు రోజులుగా సముందర్ తల్లిని చూసేందుకు రాలేదు. ఇంతలోనే ఏమైందో తెలియదు కానీ గురువారం ఇంట్లో గడప ముందు కుప్పకూలిపోయింది వృద్ధురాలు లక్ష్మి.

## ప్రకృతి కోసం పోరాడే ‘కాట్టాన్’




తమిళ నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటిస్తున్న తాజా సర్వైవల్ థ్రిల్లర్ ‘కాట్టాన్’ . ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్‌లో మార్చి 27న నేరుగా రాబోతున్న ఈ చిత్రం నుంచి చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. దట్టమైన అటవీ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విజయ్ సేతుపతి ఒక పవర్‌ఫుల్ అటవీ నివాసిగా, రగ్గడ్ లుక్‌లో కనిపిస్తూ తన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి, అడవిపై ఆధారపడి జీవించే మనుషుల హక్కుల కోసం ఒక వ్యక్తి చేసే పోరాటమే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం అని తెలుస్తుంది.






## అర్జున్ పెళ్లి ఫొటోలు షేర్ చేస్తూ సారా ఎమోషనల్





క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు, యువ క్రికెటర్ అర్జున్ టెండూల్కర్ వివాహ వేడుకలు ముంబైలో ఇటీవల అత్యంత వైభవంగా ముగిసిన సంగతి తెలిసిందే. తన చిరకాల స్నేహితురాలు, పారిశ్రామికవేత్త సానియా చందోక్‌ను అర్జున్ మార్చి 5, 2026న వివాహం చేసుకోగా, ఈ వేడుకకు సంబంధించిన అరుదైన ఫొటోలను సోదరి సారా టెండూల్కర్ తాజాగా సోషల్ మీడియాలో పంచుకుంటూ వదినపై తన ప్రేమను కురిపించింది. తనకు ఎప్పటి నుంచో ఒక సోదరి ఉండాలని కోరుకునేదాన్ని, సానియా రూపంలో ఆ కోరిక తీరిందని సారా పేర్కొంది.





## ఫాస్టాగ్ ధరల పెంపు



దేశవ్యాప్తంగా వాహనదారులకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) షాక్‌నిచ్చింది. ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం రూ.3,000లుగా ఉన్న వార్షిక పాస్ ధరపై 2.5 శాతం మేర పెంచుతున్నట్టు పేర్కొంది. తాజా పెంపుతో ఇకపై వార్షిక పాస్ ధర రూ.3,075గా ఉండనుంది. ఈ ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది.అయితే.. ఫాస్టాగ్ వినియోగదారులు మార్చి 31 లోగా రీఛార్జ్ చేసుకుంటే మాత్రం ప్రస్తుత ధరలే వర్తిస్తాయి. అంటే రూ.3,000లకే ఇయర్ పాస్ తీసుకోవచ్చు. ఒక్కసారి ఫాస్టాగ్ వార్షిక పాస్ తీసుకుంటే దేశవ్యాప్తంగా ఒక సంవత్సర కాలం లేదా 200 టోల్‌ప్లాజాల వద్ద ఆగకుండా ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది(ఏది ముందైతే అది). ఏడాది కాలంలో ఎన్నిసార్లైనా రీఛార్జ్ చేసుకోవచ్చు.



## గ్లామర్ డోస్ పెంచిన ప్రియా

తొలి సినిమా ఒరు అదార్ లవ్తో కన్నుగీటి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మలయాళ నటి ప్రియా ప్రకాష్ వారియర్, ఆ తర్వాత సినీ అవకాశాల విషయంలో వెనుకబడ్డారు. ప్రారంభంలో టాలీవుడ్, బాలీవుడ్‌ల నుండి ఆఫర్లు వచ్చినా, ఆమె నటించిన చెక్, ఇష్క్, బ్రో వంటి తెలుగు చిత్రాలు విజయవంతం కాకపోవడంతో ఇక్కడ అవకాశాలు తగ్గిపోయాయి. స్పెషల్ సాంగ్స్‌లో గ్లామర్ ప్రదర్శించినా పెద్దగా ఉపయోగపడలేదు. తమిళంలో కొన్ని హిట్స్ వచ్చినా, అవి ఆమె కెరీర్‌కు పెద్దగా దోహదపడలేదు.



## మా డిమాండ్లు తీర్చాల్సిందే... తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

తెలంగాణలో మరోసారి ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగేందుకు రెడీ అయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ యాజమాన్యానికి తాజాగా జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. గతేడాది సమ్మె చేసేందుకు రెడీ అయిన ఆర్టీసీ కార్మికులు.. ప్రభుత్వ హామీతో వెనక్కి తగ్గారు. తమ సమస్యలను పరిష్కరించుకునే వరకు ఈసారి సమ్మెను విరమించకూడదని ఆర్టీసీ కార్మిక సంఘాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లో డిమాండ్లను సాధించుకునే వరకు వెనక్కి తగ్గకూడదని నిర్ణయించుకున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి.. ఆర్టీసీ కార్మిక సంఘాలు సమ్మె నోటీసులు ఇచ్చాయి. రెండు వారాల్లోపు ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె తప్పదని నేతలు హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే సమ్మె తేదీపై రెండు వారాల తర్వాత నిర్ణయం తీసుకోనున్నారు. తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు ఎప్పటి నుంచో రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్న వేళ.. ఆ ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రధానంగా డిమాండ్ చేశారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## వాట్సాప్‌లో కొత్త ఫీచర్.. పేరెంట్ మేనేజ్డ్ అకౌంట్ ప్రారంభం

WhatsApp చిన్నపిల్లల భద్రతను దృష్టిలో పెట్టుకుని కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా 13 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల కోసం 'పేరెంట్ మేనేజ్డ్ అకౌంట్' అనే ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఫీచర్ ద్వారా పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై తల్లిదండ్రులు నేరుగా పర్యవేక్షణ చేయగలుగుతారు.గతంలో వాట్సాప్‌ను పిల్లలు కూడా పెద్దవాళ్ల మాదిరిగానే ఉపయోగించేవారు. అయితే వారి చాట్స్, కాంటాక్ట్స్ లేదా ప్రైవసీ సెట్టింగ్స్‌పై తల్లిదండ్రులకు పెద్దగా నియంత్రణ ఉండేది కాదు. కొత్తగా వచ్చిన పేరెంట్ మేనేజ్డ్ అకౌంట్ ఫీచర్‌తో పిల్లల ఖాతాను తల్లిదండ్రులు సులభంగా మానిటర్ చేయగలుగుతారు. ఎవరు పిల్లలకు మెసేజ్ చేయాలి, వారు ఏ గ్రూపుల్లో చేరాలి, ప్రైవసీ సెట్టింగ్స్ ఎలా ఉండాలి వంటి అంశాలను తల్లిదండ్రులే నిర్ణయించే అవకాశం ఉంటుంది.ఈ ఫీచర్‌ను ఉపయోగించాలంటే ముందుగా పిల్లల ఫోన్‌లో వాట్సాప్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి యాప్‌ను ఓపెన్ చేయాలి. భాషను ఎంపిక చేసిన తర్వాత Agree and Continue పై క్లిక్ చేయాలి. అనంతరం More Options లోకి వెళ్లి Create Parent Managed Account అనే ఎంపికను ఎంచుకోవాలి. తర్వాత పిల్లల ఫోన్ నంబర్‌ను నమోదు చేసి వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. అలాగే పిల్లల పుట్టిన తేదీని నమోదు చేయాలి. దీని ద్వారా వారి వయస్సు 13 సంవత్సరాల కంటే తక్కువగా ఉందని వాట్సాప్ నిర్ధారిస్తుంది. చివరగా Continue పై క్లిక్ చేసి పిల్లల ఖాతాను తల్లిదండ్రుల ఖాతాతో లింక్ చేయాలి.పిల్లల ఖాతాను తల్లిదండ్రుల ఖాతాతో లింక్ చేసే సమయంలో పిల్లల ఫోన్ స్క్రీన్‌పై ఒక QR కోడ్ కనిపిస్తుంది. తల్లిదండ్రుల ఫోన్‌తో ఆ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాత Agree and Continue అనే ఎంపిక కనిపిస్తుంది. ఆ తరువాత తల్లిదండ్రులు 6 అంకెల Parent PIN సెట్ చేసుకోవాలి. ఈ పిన్ ద్వారా మాత్రమే పిల్లల ఖాతాలోని ప్రైవసీ మరియు సేఫ్టీ సెట్టింగ్స్‌ను మార్చే అవకాశం ఉంటుంది. భద్రత దృష్ట్యా ఈ పిన్‌ను పిల్లలతో పంచుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

# గ్యాస్ సిలిండర్ల కొరత.. తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు

దేశంలో ఎల్పీజీ సంక్షోభం రోజురోజుకూ ముదురుతున్నది. దేశంలో గ్యాస్ కొరత లేదంటూ కేంద్రం ఒక వైపు ప్రకటనలు చేస్తుండగా, క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వాణిజ్య, గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్లకు తీవ్ర కొరత ఏర్పడింది. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో గ్యాస్ కోసం ప్రజలు ఏజెన్సీల ముందు బారులు తీరి కనిపిస్తున్నారు. ఇప్పటికే వాణిజ్య గ్యాస్ సిలిండర్‌కు తీవ్ర కొరత ఏర్పడటంతో పలు హోటళ్లు, వ్యాపార సంస్థలు, మెస్‌లు, హాస్టళ్లు మూతపడగా, మరికొన్ని పాక్షికంగా పనిచేస్తున్నాయి. ఈ వంట గ్యాస్ సెగ ప్రముఖ హోటళ్లకు కూడా తగిలింది. గ్యాస్ కొరతతో దేశమంతటా సిలిండర్ల బ్లాక్ మార్కెట్‌కు తెరలేచింది. భారీ రేట్లకు గ్యాస్ అమ్ముతూ దళారులు దండుకుంటున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో గ్యాస్ కొరత ఏర్పడగా, పెట్రోల్, డీజిల్‌కు కూడా కొరత వస్తుందన్న భయంతో పెట్రోల్ బంక్‌ల ముందు వాహనదారులు క్యూలు కడుతున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీల ముందు పౌరులు సిలిండర్లతో క్యూలు కడుతున్న దృశ్యాలు మీడియాలో వైరల్ అవుతున్నాయి.. ఇప్పుడు పలు పెట్రోల్ బంక్‌ల ముందు కూడా అలాంటి దృశ్యాలే కన్పిస్తున్నాయి. దేశంలో పెట్రోల్, డీజిల్, కిరోసిన్‌కు ఎలాంటి కొరత లేదని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించినా పౌరులు నమ్మినట్టు కన్పించడం లేదు. బీహార్‌లో గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ రూ.1,800, వాణిజ్య సిలిండర్‌ను రూ.4,000కు బ్లాక్‌మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇప్పటికే పలు హోటళ్లు రెస్టారెంట్లు ఇండక్షన్ స్టవ్‌లపై ఆహారపదార్థాలను వండటం



ప్రారంభించాయి. వాణిజ్య సిలిండర్ ధర రూ. 1,918 ఉండగా, భోపాల్‌లోని బార్కేడా పటానీలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ బహిరంగంగానే రూ.4,000కు అమ్ముతున్నట్టు ఒక ఆంగ్ల మీడియా వెల్లడించింది. అలాగే రూ.918 ఉండే గృహావసరాల సిలిండర్‌ను రూ.1700 నుంచి 1,800కు అమ్ముతున్నారు. బ్లాక్‌మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వం అత్యవసర వినియోగదారుల చట్టాన్ని అమలు చేస్తున్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీలు వాటిని పట్టించుకోవడం లేదు. ఏజెన్సీ ఉద్యోగులు, బ్లాక్‌మార్కెటీర్లు, ఏజెన్సీ నిర్వాహకులు అప్పడే గ్యాస్‌ను బ్లాక్‌లో అమ్మడం ప్రారంభించారు. అక్రమంగా గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేసే వారు కూడా ఈ కొరత పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. యూపీలో రోజంతా లైన్‌లో నిలబడినా లభించని సిలిండర్ కూడా 1,600 ఇస్తే వెంటనే దొరుకుతున్నదని స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. ఎల్పీజీకి తీవ్ర కొరత ఏర్పడటంతో పౌరులు, వాణిజ్య, వ్యాపార సంస్థలు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నాయి. గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా వంటచెరకు, బొగ్గును వంటకు వినియోగించవచ్చు. అయితే ఇప్పుడు వాటి ధరలు కూడా వేగంగా పెరిగిపోయాయి. విద్యాహబ్‌గా పేరొందిన రాజస్థాన్‌లోని కోటాలో మెస్, హాస్టల్ నిర్వాహకులు బొగ్గు, సంప్రదాయ కొలిమిలను వాడటం ప్రారంభించారు. సాధారణంగా మెస్‌లు, హోటళ్లు 35 నుంచి 40 కిలోల బరువుంటే కొలిమిలను తయారు చేస్తారు. అయితే ఇప్పుడు వాటికి కూడా డిమాండ్ పెరగడంతో అవి దొరకడం కష్టంగా మారింది. కొద్ది రోజుల్లోనే బొగ్గు డిమాండ్ 12 నుంచి 15 టన్నులకు చేరుకుందని ఒక వ్యాపారి తెలిపాడు. దేశ వ్యాప్తంగా ఒక వైపు గ్యాస్ ధరలు పెంచిన ప్రభుత్వం లక్షలాది మంది గ్యాస్ కోసం ఇబ్బంది పడుతున్నా కొరత ఏమాత్రం లేదంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనపై సమాజ్‌వాది పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ మండిపడ్డారు. అనేక మంది పౌరుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా గ్యాస్ కొరత ఉన్న విషయం ప్రభుత్వం అంగీకరించడం లేదని ఆమె విమర్శించారు. దేశవ్యాప్తంగా పలు ప్రదేశాలతో పాటు యూపీలోని లక్నో, గోరక్‌పూర్‌ల్లో అటు వాణిజ్య, ఇటు గృహావసర గ్యాస్‌కు తీవ్ర కొరత ఉందని ఆమె తెలిపారు. గ్యాస్ ఏజెన్సీల ముందు ప్రజలు పడుతున్న పాట్లు ప్రభుత్వానికి కనిపించడం లేదా ? అని ఆమె ప్రశ్నించారు.

## రాజేంద్రప్రసాద్‌కి మొన్న వార్నింగ్, నిన్న ప్రశంసలు



తమిళ సినీ దిగ్గజం ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) గురించి చేసిన వ్యాఖ్యల కారణంగా సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇటీవల తీవ్ర విమర్శలను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఓ కార్యక్రమంలో తెలుగు దిగ్గజ నటుడు కాంతారావు గొప్పతనాన్ని ప్రస్తావించే సందర్భంలో ఎంజీఆర్‌పై రాజేంద్ర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ముఖ్యంగా ఆయన ఉపయోగించిన పదజాలం తమిళ అభిమానులను తీవ్రంగా బాధించడంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.ఈ ఘటనపై తమిళ సినీ వర్గాలు, అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ప్రముఖులు రాజేంద్ర ప్రసాద్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా తమిళ నటులు విశాల్, నాజర్ వంటి ప్రముఖులు స్పందిస్తూ ఎంజీఆర్‌ను తమిళనాడులో ప్రజలు దేవుడిలా భావిస్తారని, అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. అలాగే తమిళనాడు ఆర్టిస్ట్స్ అసోసియేషన్ తరఫున కూడా ఈ అంశంపై స్పందించాలని కోరినట్లు తెలిపారు.




## 'మేన్ వాపస్ ఆవుంగా' టీజర్

ప్రముఖ దర్శకుడు ఇంతియాజ్ అలీ, విలక్షణ నటుడు దిల్జీత్ దోసాంజ్ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'మేన్ వాపస్ ఆవుంగా'. ఆమర్ సింగ్ చమ్కీలా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను జూన్ 12న విడుదల చేయబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే.. 1947 భారతదేశ విభజన నేపథ్యంలో సాగే ఒక ఉద్వేగభరితమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని ఇంతియాజ్ అలీ వెండితెరపై ఆవిష్కరిస్తున్నట్లు తెలుస్తుంది. దాదాపు 78 ఏళ్లుగా తన గుండెల్లో దాచుకున్న ప్రేమ జ్ఞాపకాలను నసీరుద్దీన్ షా తన మనవడికి (దిల్జీత్ దోసాంజ్) వివరిస్తుండగా, దిల్జీత్ నెరేటర్‌గా ఆ అద్భుత గాథను నేటి తరానికి పరిచయం చేయడం టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో నసీరుద్దీన్ షా యువకుడి పాత్రలో వేదాంగ్ రైనా నటిస్తుండగా, అతనికి జోడీగా శార్వరీ వాఘ్ అలరించనుంది.



## ఫరియా హాట్ పోజులు

సినిమా ఇండస్ట్రీలో అందం, అభినయం ఉన్నా అదృష్టం లేని ముద్దుగుమ్మలు చాలా మంది ఉన్నారు వారిలో ఫరియా అద్బుల్లా ఒకరు. చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. కానీ ఆఫర్స్ మాత్రం అనుకున్నంతగా అందుకోలేకపోతుంది . జాతిరత్నాలు సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఫరియా అద్బుల్లా. తొలి సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో అందం, అమాయకత్వంతో కట్టిపడేసింది. సినిమా తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది ఈ ముద్దుగుమ్మ. అవకాశాలు అయితే వచ్చాయి కానీ హిట్స్ మాత్రం పడలేదు. చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టాయి. ఆ మధ్య శ్రీ సింహాతో కలిసి నటించిన మత్తువదలరా 2 సినిమా ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. కానీ ఆతర్వాత అన్ని ఫ్లాప్ అయ్యాయి.



## స్వియాటెక్‌కు షాక్

ప్రపంచ నంబర్ 2 ర్యాంకు టెన్నిస్ క్రీడాకారిణి ఇగా స్వియాటెక్ (పోలండ్)కు ఇండియన్ వెల్స్‌లో షాక్ తగిలింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఇగా.. 2-6, 6-4, 4-6తో తొమ్మిదో సీడ్ ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్) చేతిలో కంగుతింది. టాప్ సీడ్ సబలెంకా.. 7-6 (7/0), 6-4తో విక్టోరియా (కెనడా)పై గెలిచింది. సీడ్ రిబాకినా (కజకిస్థాన్).. 6-1, 7-6 (7/4)తో జెస్సికా పెగులా (యూఎస్)ను చిత్తుచేసింది. పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ సంచలనం అల్కరాజ్.. 6-3, 6-4తో బ్రిటన్ ఆటగాడు కామెరూన్ నూరీపై ఏకపక్ష విజయంతో లాస్ట్-4 చేరాడు. సిన్నర్ (ఇటలీ).. 6-1, 6-2తో లర్నర్ టైన్ (యూఎస్) పై ఈజీ విక్టరీ సాధించాడు.

### తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

# నేటి నుంచి ప్రారంభం




తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందడి నేటి నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల 28 వేల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం 2,676 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది.ఏప్రిల్ 16 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయి. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా, విద్యార్థులు ఉదయం 8:30 గంటలకల్లా కేంద్రాలకు చేరుకోవాలని సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు సూచించింది. ఆలస్యంగా వచ్చేవారికి ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్ ఉంటుందని తెలిపింది. హాల్ టికెట్లను ఇప్పటికే పాఠశాలలకు పంపించామని, అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించుతున్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించరు.ఈసారి పరీక్షలను సుదీర్ఘంగా 33 రోజుల పాటు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా 10-12 రోజుల్లో ముగిసే పరీక్షలను ఈసారి సీబీఎస్ఈ తరహాలో పేపర్ల మధ్య ఎక్కువ రోజుల విరామం ఇచ్చారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి, మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఈ షెడ్యూల్ రూపొందించామని విద్యాశాఖ చెబుతుండగా, ఇది అశాస్త్రీయమని విద్యార్థి సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



## గుంటూరులో బ్లింకిట్ పేరుతో సైబర్ మోసం

గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణనగర్ నాలుగో లైన్‌కు చెందిన పగడాల ప్రసాద్‌ను సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. బ్లింకిట్ యాప్ ఆర్డర్ రిటర్న్ పేరుతో గూగుల్‌లో కనిపించిన నంబర్‌కు కాల్ చేయగా, యూపీఐ ద్వారా డబ్బు పంపితే రిఫండ్ వస్తుందని చెప్పి రూ.84 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## 'సర్కార్ 4' ప్రకటించిన రామ్ గోపాల్ వర్మ!

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన ఐకానిక్ పొలిటికల్ క్రైమ్ ఫ్రాంచైజీ 'సర్కార్' నుంచి నాలుగో భాగాన్ని అధికారికంగా ప్రకటించారు. ముంబైలో జరుగుతున్న రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన, 'సర్కార్ 4' చిత్రానికి సంబంధించిన పనులను వచ్చే నెల నుంచే ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. 2005లో అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో వచ్చిన 'సర్కార్' చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఆ తర్వాత 2008లో 'సర్కార్ రాజ్', 2017లో 'సర్కార్ 3' చిత్రాలు విడుదలయ్యాయి. దాదాపు తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఈ సిరీస్‌లో మరో భాగం వస్తుండటంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.